

కథా కౌముది

# మార్గదర్శి

మంథా భానుమతి

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

తలుపు తీసి బైటికి రాబోతూ జేబు తడుముకున్నాడు ఆనంద్. ఖాళీగా తగిలింది. లోపలికెళ్లి పర్స్ తీసుకుని తెరిచి కావలసినవన్నీ ఉన్నాయా అని చూసుకుని జేబులో పెట్టుకుని బైటికొచ్చి తలుపు తాళం వేశాడు. బిల్టిన్ గాడ్రెజ్ లాక్. అడ్డగడియ మాత్రం వెయ్యలేదు. ఇంట్లో మనుషులు ఉన్నారని అనుకోవాలి బైటనుంచి ఎవరైనా చూస్తే.

ఎప్పుడు బైటికెళ్లినా పర్స్ లో అన్నీ పెట్టుకుని, పర్స్ జేబులో పెట్టుకుని వెళ్లమని శ్రీమతి సరస్వతిగారి ఆర్డర్. ముఖ్యంగా సెల్ ఫోన్, తన విజిటింగ్ కార్డు, ఆధార్ కార్డు, క్రెడిట్ కార్డు. లాకర్ తాళం చెవి, బీరువా తాళాలు ఇంటి గుత్తిలోనే ఉంటాయి.. అవన్నీ ఎందుకంటే అలక.. "చటుక్కున ఏదైనా ఐతే.. కళ్లు తిరిగితే, కార్డు ముక్కుంటే ఫోన్ చేసి చెప్తారెవరైనా ధర్మాత్ములు. అలాగే, మనం లేనప్పుడు దొంగలు వచ్చినా, బీరువా తాళాలు వాళ్లకి చిక్కవు.." నిజమే.. ఎప్పటికప్పుడు మంచి సలహాలిస్తూ మార్గదర్శి అయింది, తన జీవితంలోకి ప్రవేశించినప్పటి నుంచీ.

ఆవిడని తలుచుకుని నవ్వుకుంటూ గేటు తీశాడు. ఆనంద్ కి డెబ్బై ఏళ్లు నిండాయి వారం క్రితమే. రోజూ పొద్దున్నే ఆరుగంటలలోపు వాకింగ్ కి వెళ్లడం నలభై ఏళ్ల నించీ అలవాటు.

ఇంకా తెల్లవారలేదు. మసక చీకటిగానే ఉంది. వచ్చీరాని సూర్యుడు, వెళ్లీ వెళ్లని చంద్రుడు ఊసులాడుకుంటున్నట్లు, వింత వెలుగు పరుచుకుంది, గేటు లోపలా బైటా కూడా. చలికాలం.. చేతిలో ఉన్న మంకీకాప్ తగిలించి, గేటుతీసి బైటికెళ్తూ, చేతి కర్ర మీద ఆనుకున్నట్లుగా నిల్చుని వెనక్కి తిరిగి చూశాడు ఆనంద్.

కొబ్బరి, మామిడి, అరటి చెట్ల మధ్యలో ఠీవిగా నిల్చుంది ఆనంద్ ఇల్లు. తమ ఇద్దరి కలల పంట. ఒకరి నొకరు ప్రతీ చిన్న విషయం సంప్రదించుకుంటూ కట్టిన ఇల్లు. కాంక్రీట్ పోర్టికో వద్దని, కర్ర స్తంభాలతో దిట్టమైన పందిరి వేయించింది సరస్వతి. దాని మీదికి మాలతీ తీగ, రాధామనోహరం తీగలు పాకించింది. ఇంట్లోకొచ్చే వారికి తలలూపుతూ తెల్లని, ఎర్రెర్రని పూలూ తమ సుగంధాల స్వాగతాలు పలుకుతాయి. రోజూ పైనుంచి పడే తుక్కు తుడవటం కష్టం అని వద్దన్నాడు ఆనంద్. అదంతా నేను చూసుకుంటా అని భరోసా ఇచ్చి, నిజంగానే తనే బాధ్యత తీసుకుంది. రోజూ రెండు పూటలా తుడిపించడం, వారం వారం పందిరి మీద ఎండాకులు ఏరించి, శుభ్రం చేయించడం..

ఆనంద్ కి గర్వంతో హృదయం ఉప్పొంగినట్లయింది.

మూడు పడగ్గదుల ఇల్లు.. ఊరికి దూరంగా కట్టుకున్నా.. కాలక్రమేణా ఊరు పెరిగి, అదే ఊరి మధ్యకు వచ్చేసింది. ధర కూడా అనూహ్యంగానే పెరిగింది. కోటీశ్వరులయ్యామని సంబరంగా చెప్పుకునే సరస్వతిని మురిపెంగా చూసుకోడం ఆనంద్ కి చాలా ఇష్టం.

నెమ్మదిగా నడుస్తూ, చుట్టూ పరికిస్తున్నాడు. చెప్పద్దూ.. కాలనీ సుందరవనంలా తయారయింది. గత ఇరవయ్యేళ్లలో చెట్లన్నీ బాగా పెరిగి, వీధులకి సహజ తోరణాలనేర్పరిచాయి. రెండు వీధులవతలున్న పార్కు దగ్గరవుతున్న కొద్దీ వేగం పెంచాడు ఆనంద్. అప్పటికే తన స్నేహితులంతా మార్చ్ చేస్తున్నట్లు నడవడం కనిపిస్తోంది. నాలుగు వీధుల మధ్యలో పార్క్. ప్రతీ వీధికీ గేటు. లోపల చెట్ల మధ్యలో నడక దారి. కొంత భాగం తీరుగా, కొంత భాగం అడవిలా పెంచారు చెట్లు. కాలనీ సెక్రెటరీ, తన శ్రీమతి సరస్వతే దానికి కారణం. నగరంలో తమ కాలనీ, అందులోని పార్కు ప్రత్యేకంగా ఉంటాయి. ఆమధ్యని ప్రభుత్వ గుర్తింపు కూడా వచ్చింది తమ పార్క్ కి.

“ఆనంద్.. ఇటు ఇటు..” తన ఆఫీసులోనే పనిచేసి, తన తర్వాత రెండేళ్లకి రిటైరయిన వెంకట్ పిలిచాడు. ఆనంద్ వాళ్ల పక్క వీధిలో ఉంటాడు. ఆకాలనీలో సగం మంది పైగా తమ ఆఫీసు వాళ్లే. ఆనందే అందరినీ ప్రోత్సహించి కొనిపించాడు స్థలాలు. అప్పట్లో చాలా చవగ్గా వచ్చాయి. ఒకళ్ల తరువాత ఒకళ్లు ఇళ్లు కట్టేసుకుని స్థిర పడ్డారు.

ముగ్గురు ముగ్గురుగా నడక సాగించారు.

అమెరికా ఎలక్షన్ల దగ్గర్నుంచి ఆవకాయ వరకూ సాగుతుంటుంది చర్చ.. మధ్యలో అటూ ఇటూ మారుతూ, అలిసి పోతే కాసేపు కూర్చుంటూ, రెండు గంటలు పైగా గడుపుతారు రోజూ. కొంత మంది బెంచీల మీద కూర్చుని ప్రాణాయామాలు చెయ్యడం, యువతీ యువకులు చెవుల్లో తీగలు పెట్టుకుని పరుగెత్తు కుంటూ వెళ్లడం, ఇంకా చిన్న పిల్లలు తండ్రి పోరు పడలేక, నిద్ర కళ్లతో, కళ్లు నులుముకుంటూ తూలుతూ నడుస్తూ అప్పుడప్పుడు కూలబడుతూ.. ఆహ్లాదంగా ఉంది వాతా వరణం.

ఆ రోజు వెంకట్ తన ఇంటికి పిలిచాడు ఆనంద్ ని, వేడి వేడి ఇడ్లీ తినెళ్లువుగానని. మార్నింగ్ వాక్ కి వెళ్లే ముందే స్నానం చెయ్యడం అలవాటు ఆనంద్ కి. మనసులోనే, భగవన్నామ స్మరణ చేసుకుంటూ ఉంటాడు. అందుకే ఏ సంకోచం లేకుండా వెళ్లి, ఇడ్లీతో, వేడి వేడి కాఫీకూడా కానిచ్చి ఇంటికి బయల్దేరాడు.

దారిలో కనిపించిన కొందరు మిత్రులతో, కాలనీ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు చర్చించాడు. చెత్త తీసెయ్యడానికి ఏర్పాట్లు, వాన నీళ్లు నిలవకుండా కాలువలు తవ్వడం, వెలగని వీధి దీపాలు.. ఏదో ఒక సమస్య పుడుతూనే ఉంటుంది ప్రతీ రోజూ. చేతి కర్ర ఊపుకుంటూ, స్కూలు బస్సుకోసం వెళ్తూ ఎదురు పడ్డ చిన్నారులకి టాటా చెప్తూ గేటు తీశాడు ఆనంద్.

గేటు దగ్గర్నుంచే.. మీద పడ్డ సూర్యకిరణాలకి తళుక్కుమని మెరుస్తూ కనిపించింది తలుపు మీద. అయోమయంగా, ఆశ్చర్యంగా చూస్తూ ముందుకి అడుగులేశాడు. వీధితలుపుకి అడ్డ గడియవేసుంది. దానికి, మెరుస్తూ పెద్ద తాళం కప్ప. కొత్తది. గాడ్రెజ్ నవతాళ్..

కాళ్లలోంచి ఎవరో శక్తంతా లాగేసినట్లవగా అక్కడున్న సిమెంటు బెంచీ మీద కూలబడ్డాడు ఆనంద్. ఆనుకుని కూర్చోడానికి వీలుగా కట్టించాడు తోటలో అక్కడక్కడ బెంచీలు.. తనే.

“అయ్యగారూ! వచ్చారా?” ఇంటిపక్క సందులోంచి వచ్చి పిలిచింది అలివేలు.. పనిచేసే అమ్మాయి.

అయోమయంగా చూశాడు ఆనంద్.

“అబ్బాయిగారు వచ్చి చాలా సేపు లోపలున్నారండీ. నేను వాకిలంతా ఊడుస్తూ ఉన్నాను. పెద్ద సంచుల్నిండా ఏవో సామాన్లు పెట్టుకొని, తాళం ఏసుకోని వెళ్లిపోయారు. మీరొస్తే వాళ్లింటికి రమ్మన్నారు.”

“నువ్వెళ్లిపో. నేను వెళ్తాలే..”

అలివేలు వెళ్లిపోయింది. ఆనంద్ నిస్త్రాణగా బెంచీ మీదే కూర్చుండిపోయాడు.. వెనక్కి ఆనుకుని కళ్లు మూసుకున్నాడు. చిత్రంగా.. కళ్లు రెండూ పొడారిపోయాయి. మనసులోని వేదనంతా బయటికి రానంటోంది.

ఆనంద్, సరస్వతిలకి ఒక అబ్బాయి, ఒకమ్మాయి. అమ్మాయి అమెరికా. అబ్బాయి అదే ఊళ్లో తన పిల్లల స్కూలుకి దగ్గరగా, తన భార్య ఆఫీసుకి నాలుక్కిలోమీటర్ల దూరంలో అపార్ట్ మెంట్ తీసుకుని ఉంటున్నాడు. స్వంత వ్యాపారం. కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ నడుపుతాడు.

సరిగ్గా సంవత్సరం అయింది సరస్వతి, ఆనంద్ ని వదిలి స్వర్గానికెళ్లి.

అమ్మాయి రమ్మన్నా, అబ్బాయి వచ్చెయ్యమన్నా ఇంట్లోంచి కదల్లేదు. ప్రతీ అంగుళంలో సరస్వతి సంచరిస్తూ, తనకి సందేశాలిస్తున్నట్లే ఉంది. అలివేలుకి అన్ని పనులూ నేర్పింది. ఆనంద్ కి కావలసినట్లు వండి పెడుతోంది. ఎక్కడికైనా ఎందుకెళ్లాలి? అలవాటయిన చోటు, స్నేహితులూ, కాలక్షేపం. రెండు మూడురోజులకొకసారి, తన వయసువాళ్లతో కలిసి సేవా కార్యక్రమాలకి వెళ్తుంటాడు. తనకి సరిపోగా పెన్షన్ లో ఇంకా మిగులుతుంది.

ఎప్పుడూ చిరునవ్వుతో, నలుగురికీ పనికొచ్చే సలహాలనిస్తూ, పుస్తకాలు చదువుకుంటూ కాలంగడుపుతున్న ఆనంద్ కి వేదన ఎందుకు?

సరిగ్గా నెల క్రితం మొదలయింది ఆనంద్ జీవితంలో ఘర్షణ.

అమ్మాయి దగ్గర్నుంచి వారం వారం పిలుపులు, చూడాలని ఉంది రమ్మని.

అబ్బాయి వత్తిడి పెరిగింది. తమ దగ్గరికి వచ్చెయ్య మని.

పార్కులో కలిసే స్నేహితుల పరిస్థితి కూడా ఇంచు మించు అదే.. కొందరిది తప్ప. ఎవరికీ తమ స్వేచ్ఛని పోగొట్టుకోవడం ఇష్టం లేదు.

కానీ.. ఆనంద్ కి జరిగిన విధంగా ఎవరికీ జరగలేదు.

తను బైటికెళ్లినప్పుడు కొడుకు వచ్చి తాళం వేసెయ్యడం.. తెలుసు ఆ సమయంలో వాకింగ్ కి వెళ్లి రెండు గంటలు గడుపుతాడని. వాడి దగ్గర డూప్లికేటు తాళం ఉంటుంది. అది ఉపయోగించుకుని.. ఇటువంటి పని చెయ్యడం ఊహకి కూడా అందలేదు ఎప్పుడూ! సరైన విలువలు చెలియజెప్పకుండా పెంచారా పిల్లల్ని తాము?

ఆనంద్ కి రెండు రోజుల క్రితం జరిగింది గుర్తుకొచ్చింది.

"నాన్నా! మీరొక్కరూ ఇక్కడెందుకు? మా దగ్గరకొచ్చెయ్యండి." అబ్బాయి వచ్చి, పడక్కుర్చీలో కూర్చున్న నాన్న కాళ్ల దగ్గర కూర్చుని అడిగాడు, అనునయంగా.

"నాకిక్కడ బానే ఉందిరా. ఒక్కడినీ ఉన్నానన్న బాధ లేదు. అలా గేటు ముందు నిలుచుంటే ఎవరో ఒకరు కనపడతారు. ఇంట్లో అన్ని పనులూ పనమ్మాయి చేస్తుంది. మీకు భారంగా ఉండడం ఎందుకు?" కొడుకు ప్రేమకి, బాధ్యతకి మురిసి పోతూ అన్నాడు ఆనంద్.

"మీకు బానే ఉంది.. కానీ మాకే.."

"ఏమయిందిరా?" ఆదుర్దాగా అడిగాడు ఆనంద్.

"ఏం లేదు.. మన ఇంటి పక్క రెండిళ్లు, వెనుక నున్న మూడిళ్లు కలిపి కొని అపార్ట్ మెంట్లు కడ్తానని ఒక పేరున్న బిల్డర్ వచ్చాడు. మనకి మూడు ఫ్లాట్లు ఇస్తాడుట. అది కాక కొంత కాష్. నాకూ పిల్లలు పెరుగుతున్నారు, ఖర్చులు కూడా.." ఆపేశాడు ఎర్ర బడిన ఆనంద్ మొహం చూసి.

"ఈ కాలనీలో అందరం బిల్డర్స్ కి ఇళ్లు అమ్మ కూడదని నిర్ణయించుకున్నాం. కనీసం, మేం బ్రతికున్నన్నాళ్లూ. మన పక్క, వెనుక వాళ్లు కూడా అమ్మరు. ఇది జంగిల్ లాగ ఉండడం మాకు ఇష్టం. కాంక్రీట్ జంగిల్ కాదు." ఆనంద్ నిష్ఠూరంగా అన్నాడు.

"అది కాదు నాన్నా! మనం ముందుకొస్తే అందరూ వస్తారు. డబ్బంటే ఎవరికి చేదు చెప్పండి?"

"మీ ఖర్చులు మీ సంపాదనకి తగ్గట్లుగా ప్రణాళిక వేసుకోండి. మేము అలాగే చేసేవాళ్లం మీకు తెలుసు కదా! నెలకొక సినిమా, ఒక సారి బైటికెళ్లి తినడం. అదే రకంగా, స్కూల్స్ కూడా, మీ తాహతుకి తగ్గ వాటిల్లో చేర్పించాలి. ఇంటర్నేషనల్ అంటూ లక్షలు కడ్తూ.." ఇంక మాట్లాడ్డం ఇష్టం లేనట్లు ఆపేశాడు ఆనంద్.

ఏమన్నా సలహా ఇవ్వబోయినా, దాన్ని మంచిగా తీసుకోవడం లేదు ఈ తరం వాళ్లు. వాళ్ల పిల్లలు ఏదడిగినా ఇచ్చెయ్యాలి. కాదంటే వాళ్లూ ఒప్పుకోరు, వాళ్లమ్మా ఒప్పుకోదు.

ఆనంద్ కి అందుకే తన ఇంట్లో ఒంటరిగా ఉండటమే ఇష్టం. వారానికి రెండు మూడు సార్లు ఇంటికి పిజ్జా తెప్పించుకుంటారు.. అది వాళ్ల భోజనం. రాత్రి ఆ మైదా వంటకం తింటే పడదు ఆనంద్ కి. పైగా వెయ్యి రూపాయల పైనవుతుంది. అంటే నెలకి పదివేల పైన పిజ్జాకే.. ఆలోచిస్తుంటేనే అదోలా అయిపోతుంది ఆనంద్ మనసు. అదే విధంగా పైకి చెప్పుకోలేని అనేక ఇబ్బందులు.. కలతతో కళ్లు మూసుకున్నాడు,

"నాన్నా!" అబ్బాయి పిలుపుకి కళ్లు తెరిచి చూశాడు.

"ఇంకొక్క సారి ఆలోచించండి. మా కష్టాల్ని గుర్తుంచుకోండి. పాతిక లక్షలు కాష్ ఇస్తానన్నాడు బిల్డర్. మన ముగ్గురికీ మూడు అపార్ట్ మెంట్లుంటాయి."

"చెప్పాను కదురా! నా తరువాత మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి." ఇంకేం చెప్పడానికి లేదన్నట్లు లేచి లోపలికెళ్ళి పోయాడు ఆనంద్.

అంటే.. ఈ విధంగా తనని వాడింటికి రప్పించుకుని, అనుకున్నది సాధించుకుందామను కుంటున్నాడన్నమాట. ఆనంద్ బెంచీ మీద కూర్చుని, ఏం చెయ్యాలా అని ఆలోచించ సాగాడు.

అంతలో ఫోన్ మోగింది.. తీసి చూశాడు. అమ్మాయి, అమెరికా నుంచి.

నిర్లిప్తంగా నొక్కాడు. అప్పుడే వార్త చేర్చి, తనకి అనుకూలంగా మాట్లాడమని తయారు చేసుంటాడు అన్నగారు.

"నాన్నా! ఎలా ఉన్నారు?"

"బాగున్నా.."

"ఎక్కడున్నారు?

"మనింట్లోనే. ఇంకెక్కడుంటా?" ఆనంద్ కూడా గుంభనగానే మాట్లాడ సాగాడు.

కుశల ప్రశ్నలయ్యాక అసలు విషయానికొచ్చింది అమ్మాయి.

"ఈ వయసులో మీరు ఒంటరిగా ఎందుకు నాన్నా? అన్నయ్య రమ్మని పిలుస్తున్నాడు కదా! వెళ్ళిపోండి హాయిగా.. ఆ ఇల్లు, జంజాటం అదీ ఎందుకు పెట్టుకుంటారు.." అలా పావుగంట పైగా సాగింది ప్రబోధం.

"ఊ..ఊ.." తప్ప రెండో అక్షరం పలకట్లేదు ఆనంద్.

"ఏంటి నాన్నా అలా ఉన్నారు. ఏం మాట్లాడట్లేదు. అసలెక్కడున్నారు మీరు?"

"మన తోటలో బెంచీ మీద కూర్చున్నా. మళ్ళీ మాట్లాడ్తా."

"అన్నయ్య చెప్పిన మాట వినండి నాన్నా.. ప్లీజ్.." అమ్మాయి ఇంకా ఏదో చెప్తుండగానే ఆపేశాడు ఆనంద్.

ఇప్పుడేం చెయ్యాలి? కొడుకు దగ్గరికి వెళ్ళి ఆ లంపటంలో ఇరుక్కోవడం అస్సలు ఇష్టం లేదు. కళ్ళు మూసుకుని ధ్యానంలోకి వెళ్ళపోయాడు. ఆ అంతర్యామే సూచిస్తాడు తన గమ్యాన్ని.

నెత్తి మీద ఎండ చురుక్కుమంటుంటే కళ్ళు తెరిచి, టైమ్ చూసుకున్నాడు ఆనంద్. పన్నెండు దాటింది. ఇంకా ఆకలి మొదలవలేదు. మనసు ప్రశాంతంగా అనిపించింది. రెండు గంటల్లో బాంక్ మూసేస్తారు.

బాంకుకీ, తన పెన్షన్ ఆఫీసుకీ దగ్గరలో ఉన్న హోటల్లో గది తీసుకున్నాడు. బజారుకి వెళ్ళి తనకి కావలసిన బట్టలు, అవసరమైన వస్తువులు, ఒక సూట్ కేసు కొన్నాడు. సాయంకాలం లోగా వీలయినన్ని పనులు ముగించుకోవాలి. అన్ని చోట్లా సహాయం చేసే స్నేహితులున్నారు. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందని పెద్దలు ఊరికే అన లేదు కదా!

ట్రావల్ ఏజంట్ దగ్గరికి వెళ్ళి తనకి కావలిసిన చోటికి టికెట్ కొన్నాడు. వ్యవధి తక్కువ ఉంది కనుక ఎక్కువ ఖరీదు.. కానీ తప్పదు. చెప్పవలసిన వాళ్ళకి చెప్పదలచు కున్నది చెప్పాడు.

అబ్బాయికి చాలా ఖంగారుగా ఉంది. అనుకున్నదొకటి, అయిందొకటి. తాళాలు వేసి వచ్చేస్తే వేరే దారి లేక తండ్రి తన దగ్గరకు వచ్చేస్తాడనుకున్నాడు. రెండు వారాలయింది.. ఏమైపోయారో తెలీదు.

తెలిసిన అన్ని చోట్లకీ వెళ్ళి వెదికాడు. ఎవర్నడిగినా ఏ సమాధానం లేదు. వాకింగ్ స్నేహితులైతే, అబ్బాయి కనిపిస్తే వాయిస్తున్నారు.. తనకి తెలీకుండా ఎక్కడి కెళ్తాడని.

ఇల్లు తెరిచి అంతా తిరగేశాడు. ఇంటి తాలూకు కాయితాలు కూడా ఎక్కడా లేవు. అమెరికా నుంచి రోజూ అమ్మాయి వాయిస్తోంది రెండు పూటలూ. రెండు రోజుల్నుంచీ ఏడుపు కూడా.. తనే మాయం చేశాడేమో నాన్నని అన్నట్లు నెపం వేస్తోంది.

ఇంట్లో భార్యా భర్తలకి కూడా గొడవలెక్కువై పోయాయి. తమకున్న సమస్యలు తీరక పోగా కొత్తవి వచ్చి పడ్డాయి.

ఒక నెల నీరసంగా గడిచాక, అబ్బాయికి ఈ మెయిల్ వచ్చింది. అమ్మాయికి కాపీ కూడా!

సంబోధన ఏమీ లేదు!

"ఎన్నో చెప్పాలని ఉంది. కానీ, మీకు చదివే టైము, చదివినా పాటించే ఓపిక ఉండవని నాకు తెలుసు.

మీకు కావలసిన వన్నీ అమర్చి, మానవత్వపు విలువలు తెలిసేలాగ పెంచామనే అనుకున్నాము మీ అమ్మా, నేనూ. మా అభిప్రాయాలు, ఆశలు మీ మీద రుద్దకుండా, మీకు కావలసినట్లు జీవితాన్ని మలుచుకునేట్లు చేశాము. ఏ నాడూ దేనికీ మిమ్మల్ని బలవంతం చెయ్య లేదు.

మరి ఇప్పుడు నన్ను ఎందుకు బలవంత పెడుతున్నారు?

బలవంతమే కాదు.. బల ప్రయోగం కూడా చేస్తున్నారు. నా ఇంటికి తాళం మీరు వేసుకుని వెళ్లిపోవడం అంటే అది బల ప్రయోగం కిందికే వస్తుంది. నమ్మక ద్రోహం కింద అనిపించింది. నా మనసుకి తగిలింది దెబ్బ. అది మానలేని గాయాన్ని చేసింది.

అందుకే నేనొక నిర్ణయానికి వచ్చాను.

నా పెన్షన్ నాకు సరి పోతుంది ఎక్కడున్నా. పైగా రిటైర్ మెంట్ బెనిఫిట్స్ ఉండనే ఉన్నాయి. మీ మీద ఆధార పడి లేను. ఒక్క రూపాయి కూడా ఆశించ లేదు. నేను కష్టపడి, ఎన్నో కలలు కని కట్టుకున్న ఇల్లు కూల్చేస్తానంటే ఒప్పుకోలేక పోయాను. నువ్వు ఉంటానంటే అందులో ఉండు. లేదా మంచి వాళ్లకి అద్దెకియ్యి. ఇంటి కాగితాలు నా తరువాత నీకు అందేలాగ ఏర్పాటు చేశాను.

అసలు ఏ ఆశ్రమానికో ఇచ్చేద్దామనుకున్నా కానీ.. మీకు ఇవ్వడం నా బాధ్యత అనిపించింది. అది తప్ప ఇంకేమీ నా దగ్గరనుండి ఆశించకండి.

నన్ను వెతకడానికి కూడా ప్రయత్నించకండి. దొరకను.

భగవంతుడిచ్చిన ఓపిక, ఆరోగ్యం ఉన్నాయి. ఆఖరు క్షణం వరకూ ఇలాగే ఉండ నీయమని ఆయన్ని కోరుకుంటున్నాను.

ఒక చోటంటూ లేకుండా తిరుగుతూ ఉంటాను. ఎప్పుడు ఎక్కడుంటానో నాకే తెలియదు. ఆ ప్రదేశం బాగుంటే, నాకు నచ్చితే.. ఎక్కువ రోజులుంటాను. లేక పోతే కొద్ది రోజులే ఉంటాను. ఈ ఆధునిక సాంకేతికత వల్ల పెన్షన్ ఎక్కడున్నా వస్తుంది. బయో మెట్రిక్స్ సహకారంతో, లైఫ్ సర్టిఫికేట్ కి కూడా రానక్కర్లేదు.

నాకు ప్రాపంచిక సుఖాల మీద ఆసక్తి లేదు. ఆధ్యాత్మిక గురువుల ప్రవచనాలు వింటూ, ధ్యానం చేసుకుంటూ ఉంటాను.

నేనీ ప్రపంచాన్ని వదిలి నప్పుడు మీకు సమాచారం వచ్చే ఏర్పాటు చేశాను. కర్మకాండలేమీ చెయ్యక్కర్లేదు. సన్యాసం పుచ్చుకోక పోయినా, మానసికంగా నేను సన్యాసినే.

ఇటువంటి నిర్ణయం తీసుకునే లాగ నాకు అవకాశం కల్పించి నందుకు నీకు ధన్యవాదాలు. జీవిత చరమాంకంలో నా వంటి వారు తీసుకోవలసిన నిర్ణయం ఇది.

జీవితమంతా అవసరమైన సలహాలిస్తూ మీ అమ్మ మార్గదర్శి అయితే, ఈ చరమాంకంలో ఏం చెయ్యాలో సూచించి నువ్వు మార్గదర్శి అయావు.

చివరగా ఒక సలహా.. మీ ఆదాయం చూసుకుని ఖర్చు పెట్టుకోండి. 'అతి'కి పోతే మిగిలేది 'అల్పం'. కష్ట కాలానికి కొంత దాచుకోవాలి. వీలయినంతలో ఇతరులకి సహాయం చెయ్యడం నేర్చుకోండి. ఈ విధంగా రాశానని మీ సంసారాలను పాడు చేసుకోకండి. సామరస్యంగా పరిష్కరించుకోండి సమస్యలను."

మెయిల్ చదివిన అమ్మాయి, అన్నగారికి ఫోన్ చేసింది.. కానీ మాట్లాడ్డానికి మాటలే దొకలేదు. ఏం మాట్లాడుతుంది? అన్నగారికి ఆ సలహా ఇచ్చింది తనే మరి!

★★★★★★★

Click here to share your comments on this story